సాక్షి జగిత్యాల

బుధవారం, 5, ఏప్రిల్, 2023



వైభవంగా రథోత్సవం

పెగడపల్లి : నంచర్ల శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు రథోత్సవం వైభవంగా నిర్వహించారు.



కుజదోష నివారణ పూజలు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు వైభంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/27.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

కాలం నువ్వు కలిసే వ్యక్తులను, హృదయం నువ్వు కోరే వ్యక్తులను, నీ ప్రవర్తన నీతో ఉండే వారిని నిర్ణయిస్తుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.33	గురు 4.41

న్యూస్‌రీల్

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



శ్రీఆంజనేయస్వామి

ధర్మపురి: స్థానిక శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు చిన్న హనుమాన్ జయంతి నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువపందిళ్లు నిర్మిస్తున్నారు. పులిహోర, లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. ఈనెల 6న స్వామివారి జయంతి నిర్వహిస్తారు. ఉదయం 5గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం నుంచి కొండగట్టు శ్రీఅంజనేయస్వామిని దర్శించుకునే భక్తులు నేరుగా ధర్మపురిలోని పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివస్తారు. వీరికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

అవార్డు రావడం గర్వకారణం



సమావేశ మందిరం ప్రారంభిస్తున్న వసంత

కోరుట్లరూరల్: మండలానికి పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జాతీయ అవార్డు రావడం జిల్లాకే గర్వకారణమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవనంపై నిర్మించిన మండల సమావేశ మందిరాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. జాతీయ అవార్డు కింద కేంద్రప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసిందని, ఆ నిధులు వెచ్చించి సమావేశ మందిరం నిర్మించారని తెలిపారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీడీవో నీరజ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్ ఉన్నారు.

ఉద్యోగావకాశాలు

జగిత్యాల: మొదటి అంతర్‌రాష్ట్ర మహోత్సవంలో భాగంగా జిల్లాలోని డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణులైన యువత విదేశాల్లో పనిచేసేందుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అంతర్‌రాష్ట్ర కౌశల్ మహోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో పాల్గొనే వారు తమ పూర్తి వివరాలతో ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో అధ్యాపకులు

కోరుట్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన మూడు జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు తెలంగాణ కళాశాల, విద్యాశాఖ, హైదరాబాద్ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేశ్ మంగళవారం తెలిపారు. అధ్యాపకుల మార్గదర్శనంలో విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించారని పేర్కొన్నారు. కామర్స్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ సబ్జెక్టుల్లో వర్తకులు, వినియోగదారుల ఫోన్‌పే మాప్ వినియోగంపై అధ్యయనం, వర్చువల్ వాటర్, ఫేస్ రికగ్నేషన్‌తో విద్యార్థుల హాజరు ఆటోమెటిక్‌గా నమోదు కావడం తదితర అంశాలు స్టడీ ప్రాజెక్టులకు ఎంపికయ్యాయని వివరించారు. విద్యార్థులను జిజ్ఞాస కో ఆర్డినేటర్ హ్యూమోరా సుల్తానా, విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులు నరేశ్, నీరజ, రాజ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

6నుంచి సదరం శిబిరాలు

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈనెల 6నుంచి సదరెం శిబిరాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రాములు మంగళవారం తెలిపారు. 6న ఆర్థోపెడిక్, 12న విజువల్, 19న ఆర్థోపెడిక్, 24న హియరింగ్, 26న ఆర్థోపెడిక్, 28న ఎంఆర్ శిబిరాలు ఉంటాయన్నారు. మీసేవ స్లాట్ బుకింగ్ రశీదు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తుదారులు హాజరు కావాలని సూచించారు. వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకు రావాలన్నారు.

‘పైసా’ప్రతినిధులు



> జగిత్యాల జంబిగద్దె ప్రాంతంలో ఓ ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నారు. రంగ ప్రవేశం చేసిన ఓ ప్రజాప్రతినిధి.. తనకు రూ.3లక్షలు లంచం ఇవ్వాలని భవన యజమానిని డిమాండ్ చేసినట్లు తెలిసింది. వాస్తవంగా జీప్లస్–2 అంతస్తుల వరకు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతి ఇస్తారు. కానీ జీప్లస్–5 అంతస్తుల నిర్మాణం చేపట్టిన భవన యజమాని.. వరంగల్ రీజినల్ డైరెక్టర్ నుంచి అనుమతి తీసుకున్నారు. అయినా, సదరు ప్రజాప్రతినిధి లంచం డిమాండ్ చేయడం కలకలం రేపింది.

- మామూళ్లు ఇస్తేనే నిర్మాణాలు
- లేదంటే తప్పని కూల్చివేతలు
- లంచాల కోసం వేధింపులు
- ఆందోళనలో భవన యజమానులు

జగిత్యాల: జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం యజమానులకు కత్తిమీద సాములా మారింది. టీఎస్ బీపాస్ నుంచి అనుమతి తీసుకున్నా, అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉన్నా.. ఆ ప్రాంత ప్రజాప్రతినిధుల చేయి తడపనిదే పనులు ముందుకు సాగడంలేదు. భవన యజమానులు అనుమతి తీసుకునేందుకు బల్దియా కార్యాలయాల చుట్టూ తిరగొద్దని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే టీఎస్ బీపాస్ ద్వారా సులభతరంగా అనుమతి జారీచేయాలని సర్కార్ ఆదేశించింది. అయినా, ఇవేమీ పట్టని కొందరు ప్రజాప్రతినిధులు.. యజమానుల నుంచి అందినకాడికి దండుకోవడం విస్మయం కలిగిస్తోంది.

టీఎస్ బీపాస్ అభాసుపాలు..

- భవన/ఇంటి నిర్మాణం చేపట్టే యజమానులకు సులభంగా, పారదర్శకంగా అనుమతి మంజూరు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్(టీఎస్– బీపాస్)ను అమలులోకి తీసుకొచ్చింది.
- ఈ విధానంలో దరఖాస్తు చేసుకుంటే.. తొలుత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి.
- అనంతరం మున్సిపల్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.
- నిబంధనల ప్రకారం అన్నీ సక్రమంగా ఉంటే 21 రోజుల్లో ఇంటి/భవన నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడే యజమానులు అన్ని ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తులకు జతచేస్తున్నారు.
- అయినా, కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు డాక్యుమెంట్లను కార్యాలయానికి తీసుకొచ్చి చూపించాలని ఆదేశిస్తున్నారు.
- అయితే, ఆమ్యామ్యాలు అందితేనే నిర్మాణాలకు త్వరగా అనుమతి ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

మామూళ్లు ఇవ్వకుంటే అడ్డంకులు..

నిబంధనల ప్రకారం అన్నిధ్రువీకరణ పత్రాలు ఉన్నా, టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి తీసుకున్నా.. ఏదోవంక చూపుతూ స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు మామూళ్లు ఇవ్వకుంటే కట్టడాలు కూల్చివేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏవార్డులో ఇంటి/భవన నిర్మాణం చేపట్టారనే సమాచారం తెలుసుకుంటున్న ఆ ఏరియా ప్రజాప్రతినిధి.. వెంటనే యజమానికి వద్దకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేయడం పరిపాటిగా మారుతోంది. ఒకవేళ డబ్బులు ఇవ్వకపోతే ఇంటి నిర్మాణం జరగకుండా ఏదోఒక అడ్డంకి సృష్టిస్తున్నారని యజమానులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చేసేది లేక.. చేతులు తడిపి..

- గుర్తింపు పొందిన ఇంజినీర్ నుంచి తీసుకున్న ప్లాన్ సహా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలోనే జతచేస్తున్నారు యజమానులు. పర్యవేక్షించే అధికారులు టీఎస్ బీపాస్ వెబ్‌సైట్‌ను లాగిన్ చేస్తే ఈ వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ఇందులో ప్రజాప్రతినిధుల జోక్యం ఏమీ ఉండదు. కానీ, మామూళ్ల ముడితేతప్ప అధికారులు, ప్రజాప్రతినిధులు ఇళ్ల యజమానులను వదిలిపెట్టడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. నిర్మాణ అనుమతులు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ మున్సిపాలిటీలో ఇద్దరు ఆర్‌ఐలను నియమించింది. అనుమతి లేకుండా నిర్మించే కట్టడాలను కూల్చివేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసింది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ అధికారులే డాక్యుమెంట్లు చూడాల్సిన అవసరం లేదు. కానీ, కొందరు ప్రజాప్రతినిధులు ఎక్కడ భవన నిర్మాణం చేపట్టినా.. అక్కడ వాలుతూ మామూళ్లు ఇవ్వాలని యజమానులను వేధిస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

బాబోయ్ లీకుల గోల..!



విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

- కలెక్టర్లు, సీపీ, ఎస్పీలను అలర్ట్ చేసిన ప్రభుత్వం
- ఆఖరు పరీక్ష వరకు నిర్వహణ బాధ్యత వారిదే
- నిర్లక్ష్యం వహించిన సిబ్బంది ఉద్యోగాలు పీకేస్తాం
- కలెక్టర్లు కూడా సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టంచేసిన మంత్రి, సీఎస్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో వరుసగా వెలుగుచూస్తున్న లీకేజీలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న పదోతరగతి పరీక్షల నేపథ్యంలో మరిన్ని పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది. రెండు రోజులపాటు తెలుగు, హిందీ పరీక్షల పేపర్లు వాట్సాప్ ద్వారా వైరల్ కావడంతో పరీక్షల నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఓ వైపు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ పరీక్షల పేపర్లు లీకవడం, దానిపై సిట్ దర్యాప్తు జరుగుతుండగానే.. మరోవైపు పదో తరగతి పరీక్ష పేపర్లు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతుండటాన్ని విద్యాశాఖ తీవ్రంగా పరిగణించింది. దీంతో బుధవారం నుంచి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అలజడులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

అన్ని జిల్లా కలెక్టర్లతో వీసీ..!

పదో తరగతి పేపర్లు వరుసగా సోషల్ మీడియాలో ప్రత్యక్షమవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెలుగు, మంగళవారం హిందీ పేపర్ వాట్సాప్ పేపర్లలో ప్రత్యక్షమైన తీరు పరీక్ష నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ఇది లీకేజీ కాదని చెబుతున్న పోలీసు ఉన్నతాధికారులు వాటిని సర్క్యులేట్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మంగళవారం ఉదయం హిందీ పేపర్ బయటికి వచ్చిన వెంటనే.. ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు వచ్చిన ఆదేశాల మేరకు వారివారి జిల్లాల్లో సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డీజీపీ అంజనీకుమార్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్‌జయంతి, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ సీపీ చంద్రశేఖర్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం సీపీ రెమా రాజేశ్వరితోపాటు పలువురు ఆర్డీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

జగిత్యాల: జిల్లాలో చేపట్టిన పదో తరగతి పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటున్నామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్లు అనుమతించడంలేదని స్పష్టం చేశారు. ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని తెలిపారు. అంతకుముందు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలను సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఒకరిద్దరి తప్పిదాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కలెక్టర్లు, తహసీల్దార్లు కూడా సెల్‌ఫోన్లను పరీక్షకేంద్రాలకు తీసుకెళ్లవద్దని సూచించారు. కాన్ఫరెన్స్‌కు ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్ లత హాజరయ్యారు.

కలెక్టర్లకు సైతం ఫోన్ అనుమతి లేదు..

ఎలాంటి చిన్న నిర్లక్ష్యాన్నైనా సహించేది లేదని స్పష్టంచేశారు. పరీక్షల విధుల్లో ఉన్న వారెవరైనా సరే నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిని సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష నిర్వహణలకు పూర్తిగా డీఈవోలను బాధ్యులను చేయాలని, అవకతవలకు పాల్పడితే రిమూవల్ సర్వీస్ చేయాలని కూడా కలెక్టర్లకు సూచించారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని పోలీసులకు సూచించారు. సెంటర్లను తనిఖీ చేసే కలెక్టర్లు, డీఈవోలు, తహసీల్దార్లు ఎవరైనా సరే లోనికి సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టంచేసినట్లు సమాచారం.

కరీంనగర్ పేరుతో ఉలికిపాటు..

మంగళవారం ఉదయం వరంగల్ జిల్లాలో వాట్సాప్‌లో ప్రత్యక్షమైన పదో తరగతి హిందీ పేపర్ ఉమ్మడి జిల్లా పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. పేపర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వాట్సాప్‌లో పోస్టులు చేశారని వార్తలు రావడంతో జగిత్యాల, సిరిసిల్ల, రామగుండం, కరీంనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇక ఇంటిలిజెన్స్ పోలీసులు కూడా ఈ వ్యవహారంలో ఆరా తీయడం ప్రారంభించారు. మొత్తానికి సాయంత్రానికి పేపర్ కరీంనగర్ జిల్లా నుంచి లీకవలేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సంజయ్‌ది రెండునాల్కల ధోరణి

- నిజాయతీపరుడంటూ గొప్పలు
- ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే..
- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి ధ్వజం



మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ది రెండునాల్కల ధోరణి అని, ముందొకటి, వెనకొకటి మాట్లాడటం ఆయన రాజకీయ చతురతకు నిదర్శమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి మండిపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కిందిస్థాయి నాయకులను వేధిస్తున్న సంజయ్.. తాను నిమిత్తమాత్రుడని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల ప్రెస్‌మీట్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేకు ఇరువైపులా కూర్చున్నవారిలో ఇసుకదందా చేసేవారు ఉన్నారని, అందులో ఎమ్మెల్యే వాటా ఎంతో చెప్పమంటారా? అని శ్రావణి సవాల్ విసిరారు. ప్రజలకు అన్నీ తెలుసని, రాత్రిపూట ఎన్ని ట్రక్కుల ఇసుక వస్తుందన్న అంశంపై తహసీల్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఇసుక దందా, భూ కబ్జా, కాంట్రాక్టులు చేస్తూ.. బీజేపీ నాయకులను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే ఎమ్మెల్యే సంజయ్.. ఏడాదిక్రితం పూర్తయిన అమరవీరుల స్థూపాన్ని ఎందుకు ప్రారంభించలేదో చెప్పాలని నిలదీశారు. మున్సిపల్ పార్క్ అభివృద్ధి కోసం రూ.50లక్షలు కేటాయించినా పనులు ఎందుకు ప్రారంభించడంలేదన్నారు. యాక్షన్, డైరెక్షన్ చేయడంలో సంజయ్‌కుమార్ దిట్ట అని ఎద్దేవా చేశారు. ప్రజలు, హైకమాండ్ ముందు కౌన్సిలర్లను బద్నాం చేసింది ఎమ్మెల్యే కాదా? అని నిలదీశారు. ఎమ్మెల్యే వేధింపులు వాస్తవమని చెప్పడానికి త్వరలో ఏర్పాటు కానున్న ఎమ్మెల్యే బాధితుల సంఘమే నిదర్శనమని ఆమె వెల్లడించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు మదన్, పడాల తిరుపతి, వీరబత్తిని అనిల్ ఉన్నారు.

సూరమ్మ ప్రాజెక్టును మేమే పూర్తిచేస్తాం



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, వేదికపై వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కథలాపూర్(వేములవాడ): ‘తెలంగాణ రాష్ట్రం తెస్తామని చెప్పి కొట్లాడి తెచ్చినం.. ఇచ్చినమాట ప్రకారం వేములవాడ నియోజకవర్గంలో సాగునీరందించే కలిగోట సూరమ్మ ప్రాజెక్టును మేమే పూర్తిచేస్తామని’ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిపారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అడిగితే సూరమ్మ ప్రాజెక్టును నిర్మించడంలేదని, తామే సొంతంగా రైతుల గురించి ఆలోచించి ప్రాజెక్టుతోపాటు కుడి, ఎడమ కాలువలు నిర్మించాలని ఆలోచించామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడంలో అర్థంలేదని, ప్రభుత్వం తెచ్చిన అప్పులతో రాష్ట్రంలో శాశ్వతంగా ప్రయోజనాలు చేకూర్చే అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. కార్యకర్తలకు ఏమైనా సమస్యలుంటే చర్చించుకోవాలని, వీలైతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ జిల్లా పరిశీలకుడు కోలేటి దామోదర్, అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీపీ రేవతి, ఏఎంసీ చైర్‌పర్సన్ సౌజన్య ఉన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

జగిత్యాల: చిరు ధాన్యాలపై అవగాహన కల్పించి, ఆహార నియమాలు పాటించడంలో ప్రజల్లో చైతన్యం తేవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పట్టణంలో మంగళవారం చేపట్టిన ముగింపు ఉత్సవాల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం మిల్లెట్స్‌తో తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆరోగ్యవంతులైన పిల్లలకు గుడ్ హెల్త్ సర్టిఫికెట్లు అందజేశారు. సంక్షేమాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆరోగ్య మహిళ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. స్థానిక అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో శ్రీధర్, ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి ఉన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. పలు పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కాగా, మంగళవారం జరిగిన పరీక్షలకు 11,175 మంది విద్యార్థులకు 11,158 మంది హాజరయ్యారని, 99.84శాతం హాజరు నమోదైందని అధికారులు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ లత, డీఈవో జగన్మోహన్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

జగ్జీవన్‌రామ్ జయంతికి ఏర్పాట్లు

స్థానిక మంచినీళ్ల బావి వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహిస్తామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాలు హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై విచారణ?

జగిత్యాల: జిల్లాలోని రాయికల్ మండలం తాట్లవాయి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సుమారు 20 ఏళ్లపాటు విధులకు హాజరు కాలేదు. ఈవిషయంపై అధికారులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈవిషయంపై పలు ఉపాధ్యాయ సంఘాలు ఇటీవల కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు చేశాయి. మరోవైపు.. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి తమకు ఆదేశాలు రావడంతోనే సదరు ఉపాధ్యాయుడికి జిల్లాలోని కోమటికొండపూర్‌లో పోస్టింగ్ ఇచ్చామని జిల్లా జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదేవిషయంపై ‘ఇరవై ఏళ్లపాటు విధులకు గైర్హాజరు’ శీర్షికన గతనెల 30న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధిత శాఖ అధికారులు.. సదరు ఉపాధ్యాయుడి తీరుపై విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

జై శ్రీరామ్.. జై హనుమాన్



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది దీక్షస్వాములు తరలి వచ్చి దీక్ష, మాల విమరణ చేశారు.

- 10లో

నడికుడ శివారులో చిరుత సంచారం?



నడికుడ శివారులో అటవీ జంతువు కాలిముద్ర



కాలిముద్రలు పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మల్లాపూర్(కోరుట్ల): నడికుడ శివారులో సోమవారం రాత్రి చిరుతపులి సంచరించిందనే ప్రచారం కలకలం సృష్టించింది. మొగిలిపేట–నడికుడ మధ్య బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై దాడి చేసేందుకు చిరుత యత్నించిందని, ఆ సమయంలో వెనకాల వస్తున్న టాటా ఏస్ డ్రైవర్ నరహరి బిగ్గరగా హారన్ చేయడంతో అది పారిపోయిందని స్థానికులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమాచారంతో మెట్‌పల్లి అటవీ రేంజ్ అధికారి సౌకత్ ఆలీ, అధికారులు నడికుడ చేరుకుని విచారణ చేపట్టారు. కాలిముద్రలు గుర్తించిన ఎఫ్‌ఆర్వో.. అది చిరుత కాదని తేల్చారు. ఆ కాలిముద్రలు ‘హైనా’వి అని స్పష్టం చేశారు. మరోవైపు.. ఆదిలాబాద్, నిర్మల్ అటవీప్రాంతాల నుంచి గోదావరి నది దాటి జగిత్యాల జిల్లాలోకి చిరుతలు వలస వచ్చే అవకాశం ఉందని, రాత్రి వేళల్లో ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా ప్రయాణం చేయొద్దని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఎఫ్‌ఆర్వో సౌకత్ ఆలీ సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఈజీఎస్ ఏపీడీ శివాజీ ఉపాధి కూలీలకు సూచించారు. తిమ్మాపూర్ తండాలోని కాలువలో మంగళవారం ఉపాధిహామీ కూలీలు చేపట్టిన పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. వారిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. అనంతరం నర్సరీ పరిశీలించారు. ఇన్‌చార్జి ఏపీవో వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నిరోష ఉన్నారు.

క్లుప్తంగా

ఎండలో.. 8 గంటలు గాంధీ వేషధారణలో..



కొండపై గాంధీ వేషధారణలో వ్యక్తి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవాలయానికి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఏటా ఈ వేడుకల సమయంలో చాలా మంది వివిధ రకాల వేషధారణల్లో కనిపిస్తుంటారు. మంగళవారం ఓ వ్యక్తి గాంధీ వేషధారణలో 8 గంటలపాటు ఎండలోనే ఉన్నాడు. భక్తులు అతనితో సెల్ఫీ, ఫొటోలు దిగి వెళ్లారు.

'పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం'

మెట్‌పల్లి(కోరుట్ల): పదోతరగతి పరీక్షల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు బిర్కుల విజయ్ ఆరోపించారు. మంగళవారం మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీకేజీ అవుతున్నాయని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అప్సర్, పోల్కం శివ, రవికాంత్, శ్రీను, శ్రీనాథ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో చోరీ

- పలువురి జేబుల్లో నుంచి రూ.60 వేలు మాయం చేసిన దొంగలు

కథలాపూర్: మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ సమయంలో జేబుదొంగలు తమ పని కానిచ్చేశారు. కథలాపూర్ మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన పత్రి నర్సయ్య జేబులో నుంచి రూ.50 వేలు, తాండ్ర్యాల గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారావు జేబులో నుంచి రూ.10 వేలు కాజేశారు. మరో ఇద్దరు నాయకులకు చెందిన రూ.2 వేల చొప్పున మాయమయ్యాయి. కానీ వారు బయటకు చెప్పడానికి ఇష్టపడటం లేదు. ఆత్మీయ సమ్మేళనానికి ఎక్కువ మంది హాజరవడం దొంగలకు కలిసొచ్చినట్లయిందని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు వాపోయారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి గంగాధర్‌ను దొంగతనం కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లిలో ఈ నెల 1న రాత్రి ఎండీ.సాజిద్ ఇంట్లోకి చొరబడి పీరీలకు అలంకరించే వెండి ఆభరణాలను గంగాధర్ చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతని వద్ద 768 గ్రాముల వెండి ఆభరణాలు దొరికాయని ఎస్సై పేర్కొన్నారు. దీంతో మంగళవారం గంగాధర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

లేయర్ కోళ్ల ఫారాలపై ఆసక్తి



కట్లకుంటలోని లేయర్ కోళ్ల ఫారం



కోళ్ల ఫారంలో ఉత్పత్తి అయిన గుడ్లు

- వ్యవసాయానికి అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న యువత
- 10 వేల కోళ్లకు సరిపోయే ఫారానికి రూ.కోటి వరకు రుణం
- మంజూరు చేస్తున్న బ్యాంకులు

జగిత్యాల అగ్రికల్చర్: ఇటీవలి కాలంలో జగిత్యాల జిల్లాలోని రైతు కుటుంబాలకు చెందిన గ్రామీణ యువత వ్యవసాయానికి అనుబంధంగా లేయర్ కోళ్ల ఫారాల(గుడ్ల కోళ్లు)లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా చదువుకున్న యువకులు తమ వ్యవసాయ భూమిలో అధునాతన టెక్నాలజీతో వీటిని ప్రారంభిస్తున్నారు.

10 వేల కోళ్ల నుంచి ప్రారంభం..

ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లినవారు, హైదరాబాద్ లాంటి నగరాల్లో చాలీచాలని వేతనానికి పనిచేసేవారు స్వగ్రామాలకు తిరిగివచ్చి లేయర్ కోళ్ల ఫారాలు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి దఫాగా 10 వేల కోళ్లతో వీటిని ప్రారంభిస్తున్నారు. అనుభవం పెరిగిన కొద్దీ కోళ్ల సంఖ్య పెంచుతున్నారు.

బ్యాంకుల చేయూత..

వ్యవసాయ భూమి ఉండి, కోళ్ల ఫారాలు నిర్మించుకుంటామని ముందుకు వచ్చే యువతకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయి. 10 వేల కోళ్లకు సరిపోయే ఫారం నిర్మాణానికి రూ.కోటి వరకు ఇస్తున్నాయి. ఒక్కసారి కోడి గుడ్డుకు వస్తే, దాదాపు ఏడాదిపాటు గుడ్లు పెడుతుంది. ఇప్పుడు లేయర్ కోళ్లఫారాల్లో కేజ్ కల్చర్ రావడంతో పొడుచుకోకుండా, ఒక్కో బాక్స్‌లో 4 కోళ్లను ఉంచుతున్నారు. మొక్కజొన్న వంటి ముడిపదార్థాలను కొనుగోలు చేసి, నేరుగా ఫారంలోని ఓ గదిలో గ్రైండింగ్ చేసి, కోళ్లకు అందించే వెసులుబాటు ఉంది. నీటిని పైపుల ద్వారా అందించవచ్చు.

గుడ్ల విక్రయదారులతో ఒప్పందం

ఫారాల యజమానులు గుడ్ల విక్రయదారులతో నేరుగా ఒప్పందం చేసుకుంటున్నారు. కోళ్లకు ప్రోటీన్లు, మిటమిన్లు లభించే పోషకాహారంతోపాటు కోడి గుడ్లు పగలకుండా ఉండేందుకు అవసరమైన దాణాను సైతం కంపెనీలు సరఫరా చేస్తుండటంతో పెద్దగా ఇబ్బందులు లేవు. దీనికి తోడు కోడి పెంటకు మంచి డిమాండ్ ఉంది. కొంత తమ పొలాలకు ఉపయోగించుకొని, మిగతాది రైతులకు విక్రయియిస్తున్నారు.

మూడు కూలీల జంటలతో నిర్వహణ

పది వేల కోళ్ల ఫారానికి రెండు లేదా మూడు కూలీల జంటలు చాలు. ఒక్కో జంటకు వారి పనితనాన్ని బట్టి రూ.12 వేల వరకు జీతం ఉంటుంది. ఫారాల్లో అపరిశుభ్రత లేకుండా చూసుకోవడం, ఒక్కటి, రెండు కోళ్లు చనిపోతే ఎందుకు చనిపోతున్నాయో ముందుగానే పసిగట్టి వాటిని వేరు చేస్తుంటారు. దాణా, కోళ్లు ఇచ్చిన కంపెనీల ప్రతినిధులు ఫారాలను సందర్శిస్తుంటారు. వారి ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకుంటూ ముందుకెళ్తున్నారు.

ఖర్చు మేరకు ఆదాయం..



నేను మొన్నటివరకు వ్యవసాయం చేశాను. పెద్దగా ఆదాయం లేదు. బ్యాంకు లోన్ తీసుకొని, 10 వేల కోళ్ల ఫారాన్ని మామిడి తోటలో ప్రారంభించాను. దీనికి భారీ ఖర్చు, ఆ మేరకు ఆదాయం ఉంటుంది.
– రాజేందర్, కట్లకుంట, మేడిపల్లి మండలం

వ్యవసాయానికి అనుబంధంగా..



వ్యవసాయానికి అనుబంధంగా లేయర్ కోళ్ల ఫారం ఏర్పాటు చేశాను. అంతకుముందు దీని గురించి బాగా తెలుసుకున్నాను. చిన్నచిన్న సమస్యలను పసిగట్టి, కూలీలను అప్రమత్తం చేస్తాను. – మహేందర్, రాయికల్

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆత్మీయ సమ్మేళనాలు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: సీఎం కేసీఆర్ తన హామీలు, మోసపు చర్యలతో అన్నివర్గాజలను దగా చేశారని, అధికారం అప్పగించిన రాష్ట్రప్రజల హక్కులను కాపాడలేని కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగే హక్కు కోల్పోయారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆత్మీయ సమ్మేళనాల పేరిట హడావుడి చేస్తోందని దుయ్యబట్టారు. సమ్మేళనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తల అసంతృప్తిని తొలగిస్తారేమో కానీ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకతను తగ్గించలేరని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు గిరి నాగభూషణం, కల్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్,లైశెట్టి విజయ్, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వొద్దు

- అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత



ధాన్యం కొనుగోలు నిబంధనల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాల అగ్రికల్చర్: యాసంగి ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అన్నారు. జిజగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్‌లో మంగళవారం యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని చెప్పారు. రైతులు తప్ప, తాలు లేని నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చుకోవాలని, గన్నీ సంచులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నియమ నిబంధనల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు మాధురి, వినోద్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీనారాయణ, డీఎస్‌వో చందన్‌కుమార్, సివిల్ సప్లై మేనేజర్ రంజిత్‌కుమార్, సెర్ప్ ఏపీడీ సుధీర్, డీపీఎంలు మల్లేశం, వెంకటేశం, వనజ, మాణిక్ రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది నియంతృత్వ వైఖరి

- బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): రైతులకు, యువతకు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం కథలాపూర్ మండలంలోని పోతారంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గ సమస్యలను పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు విదేశీ పర్యటనలకు ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు. సిరికొండ–తక్కళ్లపెల్లి బ్రిడ్జి, సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ నాయకుడు మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గాందారి శ్రీనివాస్, మల్యాల మారుతి, బండ అంజయ్య, బద్రి సత్యం, ప్రకాశ్, అజయ్‌రావు, ప్రతాప్‌రెడ్డి, లోక్యానాయక్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో బాలికలకు వల

- మోసపోతున్న బాధితురాళ్లు
- జిల్లాలో వెలుగుచూస్తున్న సంఘటనలు

"జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలుడు, బాలిక ప్రేమించుకొని, వారం రోజుల క్రితం పారిపోయారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కానీ ఇప్పటివరకు వారి ఆచూకీ దొరకడం లేదు."

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లాలో బాలికలకు కొంతమంది మాయమాటలు చెబుతూ మభ్యపెట్టి, మోసం చేస్తున్నారు. అభం శుభం తెలియని మైనర్ అమ్మాయిలు వారి మాటలు విని, తమ జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు. మరికొందరు నిమ్మించి, బాలికలతో సన్నిహితంగా ఉంటూ వారిని వంచిస్తున్నారు. ఇంకొందరు సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలను చూపుతూ వారిని లైంగికంగా లొంగదీసుకుంటూ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

సెల్‌ఫోన్‌లో చాటింగ్..

ఆన్‌లైన్ విద్యాబోధన కారణంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు సెల్‌ఫోన్ల వినియోగం పెరిగింది. ఇదే అదునుగా భావించిన కొందరు ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాలికలతో చాటింగ్ చేస్తూ వారిని లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే కొంతమంది అమ్మాయిలు తెలిసీ తెలియని వయసులో తమ స్నేహితులకు, బంధువులకు సెల్‌ఫోన్ నంబర్లు ఇస్తున్నారు. వారు స్నేహం పేరుతో ఫోన్‌లో చాటింగ్ చేస్తూ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

పెళ్లికి నిరాకరణ.. జైలుకు..

జిల్లా వ్యాప్తంగా చాలా మంది బాలికలు ప్రేమ పేరిట మోసపోతున్నారు. యువకులు తల్లిదండ్రులకు తెలియకుండా వారి వెంట తిరుగుతూ కొద్ది రోజులు గడిచిన అనంతరం నిరాకరిస్తున్నారు. దీంతో బాధిత అమ్మాయిలు మోసపోయామని గ్రహించి, పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు పిలిపించి, కౌన్సెలింగ్ చేసినా యువకులు వివాహం చేసుకునేందుకు నిరాకరిస్తుండటంతో కేసులు పెట్టి, జైలుకు పంపిస్తున్నారు.

30 లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ

- ఆస్తిపన్నుపై మున్సిపల్ అధికారుల అవగాహన
- జగిత్యాలలో ఇప్పటివరకు వసూలైంది 70 శాతమే



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల: 2023–24 ఆర్థిక సంవత్సరానికి నివాస, నివాసేతర బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తారు. మున్సిపాలిటీల్లో ముందస్తు ఆస్తిపన్ను చెల్లించేవారి కోసం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ వారు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30లోపు చెల్లించిన వారికి ఇది వర్తిస్తుంది. జగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలు ఉండగా కోరుట్ల, మెట్‌పల్లిల్లో ఈ ఏడాది దాదాపు 90 శాతం పన్ను వసూలవగా ఒక్క జగిత్యాలలో మాత్రమే 70 శాతానికి పరిమితమైంది. పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో మొండి బకాయిలు చెల్లించనివారి ఆస్తులు సైతం జప్తు చేస్తున్నారు. వచ్చే సంవత్సరానికి సంబంధించిన బకాయిల వసూలు కోసం అధికారులు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. ఎర్లీబర్డ్ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు..

ఎర్లీబర్డ్ పథకంలో భాగంగా ప్రతీ మున్సిపాలిటీలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ శాఖ ఉత్తర్వులిచ్చింది. దీంతోపాటు ప్రతీ వార్డులో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆస్తిపన్ను అత్యధికంగా ఉన్నవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. ఇప్పటికే జగిత్యాలలో ఈ నెల 1 నుంచి ప్రారంభం కావడంతో కొంతమేర చెల్లిస్తున్నారు. రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించినవారికి బహుమతులు సైతం ఉంటాయి. పన్ను చెల్లిస్తే పట్టణం అభివృద్ధి చెందుతుంది.
– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

వరికి తెగుళ్లపై అప్రమత్తం



వరి పొలం పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ధర్మపురి: వరి పంటకు సోకుతున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్త బలరామ్ సూచించారు. రాజారం, ఆరెపెల్లి గ్రామాల్లో వరి పంటకు సోకుతున్న తెగుళ్లను మంగళవారం శాస్త్రవేత్తలతో కలిసి ఆయన పరిశీలించారు. పంటకు మెడవురుగు తెగుళ్ల అధికంగా ఆశిస్తున్నాయన్నారు. చీడపీడలు, సస్య రక్షణ చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. జైన పీఏసీఎస్ చైర్మన్ నరేశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు తృటిలో తప్పిన ప్రమాదం



ధర్మపురిలో గుంతలో దిగబడ్డ కారు

ధర్మపురి: మంగళవారం గోదావరి పుణ్యస్నానాలకు వస్తున్న భక్తుల కారు ధర్మపురిలోని బోయవాడలో రోడ్డుపై గుంతలో దిగబడింది. ఎంతకీ బయటకు రాకపోవడంతో స్థానికుల సాయంతో లాగారు. భక్తులకు తృటిలో ప్రమాదం తప్పిందని అక్కడున్నవారు తెలిపారు. భక్తులు నిత్యం గోదావరి స్నానాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. రోడ్డుపై గుంత ప్రమాదకరంగా మారింది.

పేపర్ లీకేజీలకు నిరసనగా రిలే దీక్ష



దీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): పేపర్ లీకేజీలను నిరసిస్తూ మెట్‌పల్లి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో బీఎస్పీ నాయకులు మంగళవారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లీకేజీలతో లక్షలాది మంది నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. దీక్షకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుజ్జేరి ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల లక్ష్మణ్, నాయకులు అబ్దుల్ హఫీజ్, ఏలేటి నరేందర్‌రెడ్డి, ఖుత్బుద్దీన్, ప్రభాకర్, బర్ల లక్ష్మణ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మార్కెట్‌కు సెలవులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ నక్కల రాధ మంగళవారం తెలిపారు. బుధవారం(5న) బాబూ జగ్జీవన్‌రావ్ జయంతి, గురువారం(6న) అడ్తి, ఖరీదుదారుల విన్నపం మేరకు, శుక్రవారం(7న) గుడ్ ఫ్రైడే సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు వివరించారు. 8న మార్కెట్‌లో క్రయవిక్రయాలు సాగుతాయని, రైతులు ఈ విషయం గమనించాలని ఆమె సూచించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

- ప్రహరీ కూలిన ఘటనలో రెండు రోజుల్లో మృత్యుఒడికి తల్లీకూతురు
- ఎల్లారెడ్డిపేటలో విషాదం



అక్షయ (ఫైల్)



ఆసుపత్రిలో అక్షయ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రహరీ ఆ ఇంట్లో తీరని విషాదం నింపింది. మృత్యు శకటంగా మారి తల్లీకూతురు ప్రాణాలు తీసింది. ఈ హృదయ విదారకర ఘటనతో ఎల్లారెడ్డిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఆరె దేవవ్వ (36), ఆమె కూతురు అక్షయ(16)లు కలిసి సోమవారం తమ ఇంటివద్ద ప్రహరీని ఆనుకొని ఇసుక పోశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కూలి, వారిపై పడింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దేవవ్వ భర్త నర్సయ్య వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించగా అప్పటికే దేవవ్వ మృతిచెందింది. అక్షయను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న అక్షయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు మంగళవారం ఉదయం చెప్పారు. ఒకవైపు కూతురు చావుబతుకుల్లో ఉండగానే కుటుంబసభ్యులు, బంధువులు తల్లి మృతదేహానికి సాయంత్రం దహనసంస్కారాలు పూర్తి చేసి, ఇంటికి వచ్చారు. అప్పుడే వారికి అక్షయ కూడా చనిపోయినట్లు తెలిసి, కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు రోజుల వ్యవధిలో తల్లీకూతురు మృతితో స్థానికులు కంటతడి పెట్టారు. దేవవ్వ భర్త నర్సయ్య దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అక్షయ ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమె త్వరగా కోలుకోవాలని సహచర విద్యార్థులు స్థానిక ఆలయాల్లో చేసిన పూజలు ఫలించలేదు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

జింక పిల్లను కాపాడిన గ్రామస్తులు



జింక పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

రాయికల్(జగిత్యాల): మండలంలోని దావన్‌పల్లి సమీపంలో కుక్కలు మంగళవారం ఓ జింక పిల్లను తరమడంతో అది గ్రామంలోకి వచ్చింది. గమనించిన స్థానికులు దాన్ని రక్షించారు. సర్పంచ్ భూక్య యమున అందించిన సమాచారంతో అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. దీంతో స్థానికులు జింక పిల్లను వారికి అప్పగించారు. అధికారులు జింక పిల్లను అడవిలో వదిలేసినట్లు సర్పంచ్ తెలిపారు.

బలగం సినిమా చూసి ఒక్కటైన కుటుంబం



బలగం సినిమా చూసి కలిసిన కుటుంబం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల):బలగం సినిమా చూసి స్పందించిన ఓ కుటుంబం కలహాలు వీడి ఒక్కటైంది. వివరాలు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్టణంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో తరలివచ్చి సినిమా తిలకించారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తూ గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. అయితే, గ్రామానికి చెందిన అన్నదమ్ములు బొప్పరతి సంజీవ్, రాజేందర్, జనార్దన్ కుటుంబాలు కూడా సినిమా తిలకించాయి. ఈ మూడు కుటుంబాలు మనస్పర్థలతో 15ఏళ్లుగా మాట్లాడుకోవడంలేదు. వీరి తల్లి బొప్పరాతి తారబాయి మంగళవారం ఉదయం వృద్ధాప్య కారణాలతో మృతి చెందింది. బలగం సినిమాలో మాదిరిగానే ముగ్గురు అన్నదమ్ములు, వారి కుటుంబాలు కలిసిపోయాయి. తల్లి అంతిమయాత్ర నిర్వహించాయి.

కొండపై వర్షం.. భక్తులకు ఇబ్బంది



వర్షపు నీరు తొలగిస్తున్న కార్మికులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో హన్మాన్ చిన్న జయంతి వేడుకల సందర్భంగా దీక్ష విరమణకు తరలివచ్చిన దీక్షాస్వాములకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆలయ పరిసరాలు బురదగా మారి కాలినడక గగనమైంది. వెంటనే పారిశుధ్య కార్మికులు రంగంలోకి దిగారు. నీటినిల్వలు తొలగించారు. చెత్తాచెదారం తొలగించారు. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొండగట్టుకు చేరుకుని కోనేరులో నీటిని పరిశీలించారు. భక్తులకు కల్పించాలని సూచించారు. సౌకర్యాలపై దీక్షా స్వాములను అడిగి వివరాలు తెలుసుకున్నారు.